అభివృద్ధిని చూసి ఓర్వలేకే ధూళిపాళ్ల విమర్శలు

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య

పొన్నూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో గత నాలుగున్నరేళ్ల కాలంలో పొన్నూరు నియోజక వర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. రోడ్డు విస్తరణ భవన యజమానుల నివాసాల వద్ద విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్డు విస్తరణను చేపడితే భవన యజమానులతో పాటు, వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు హర్షించారని తెలిపారు. ఎలాంటి సంకోచం లేకుండా భవన యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్డు విస్తరణకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. విస్తరణలో కొంత భాగం ఇల్లు నష్టపోయిన వారికి మరమ్మతుల కోసం రూ. 3.5 కోట్ల పరిహారాన్ని అందించినట్లు పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీన రూ. 7 కోట్లతో చేపట్టే రోడ్డు అభివృద్ధి పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. భవన యజమానుల్ని ఇబ్బందులకు గురిచేసి, వారిని రెచ్చగొట్టే విధంగా ధూళిపాళ్ల నరేంద్ర విశ్వప్రయత్నాలు చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రోడ్డు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఎంపీ మహమ్మద్, నాయకులు షేక్ మాము, అంబటి వెంకటేశ్వరరావు, బొద్దులూరి రంగారావు, వట్టిప్రోలు రంగారావు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే విస్తరణ చేస్తే కష్టాలు తప్పేవి

టీడీపీ పాలనలో పాతికేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ధూళిపాళ్ల నరేంద్ర హయాంలో రోడ్డు విస్తరణ చేసి ఉంటే ఇప్పుడు ఈ కష్టాలు ఉండేవి కాదు కదా.. రోడ్డుపై నిరసనలు చేపట్టాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చేది.. విస్తరణతో ప్రజల కష్టాలు తీరాయి. నా ఇంటిలో కొంత భాగం కోల్పోయినందుకు ప్రభుత్వం పరిహారంగా రూ. 7.5 లక్షలతో పాటు టీడీఆర్ బాండ్ అందించింది.

– పిడుగు వెంకటరమణమూర్తి, భవన యజమాని

దశాబ్దాలుగా ట్రాఫిక్ కష్టాలతో అవస్థలు

ఇంటిలో కొంత భాగం కోల్పోయినందుకు రూ. 10.50 లక్షలతో పాటు కోటి విలువ చేసే టీడీఆర్ బాండ్ అందించారు. దశాబ్దాలుగా ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విస్తరణతో భవన యజమానులు ఎవరూ నష్టపోలేదు. అందరి ఒప్పందం, సహకారంతోనే రోడ్డు విస్తరణ పనులు జరిగాయి. మా అందరికీ నష్ట పరిహారం అందించిన తర్వాతే పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే రోశయ్య చేపట్టిన విస్తరణ పనులతో మేమంతా సంతోషంగా ఉన్నాం.

–అన్నవరపు నాగ వెంకట కృష్ణారావు, భవన యజమాని

క్లుప్తంగా

రేపు వడ్లమూడిలో బజరంగ్ నేత్ర జ్యోతి వైద్య శిబిరం

చేబ్రోలు: బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వడ్లమూడిలో బజరంగ్ నేత్ర జ్యోతి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సీఈవో అంబటి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన ఆదర్శంగా తీసుకొని సామాజిక సేవా కార్యక్రమాల పరంపరను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కంటి సమస్య ఉన్నట్లు గుర్తించిన వారికి ఏడు రోజుల్లోగా కళ్లజోళ్లను అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 10,698మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 9082మందికి కళ్లజోళ్లను అందించినట్లు మురళీకృష్ణ వెల్లడించారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



వల్లూరు(కాకుమాను): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో మద్యం అమ్మినా, బెల్టు షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని పొన్నూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుకన్య హెచ్చరించారు. మండలంలోని వల్లూరులో మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం ఆమె ఎస్ఐ గీతిక ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఇంకొల్లు వెంకట రామబ్రహ్మం మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. అతని వద్ద పది క్వాటర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహించినా, మద్యం విక్రయించినా సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

కొమ్మమూరు చానల్‌లో యువకుడి గల్లంతు




అప్పాపురం (కాకుమాను):మండలంలోని అప్పాపురం వద్ద కొమ్మమూరు చానల్‌లో యువకుడు గల్లంతైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది.ఎస్ఐ రవీంద్ర తెలిపిన వివరాల మేరకు... బాపట్లకు చెందిన షేక్ జానీబాషా అనే యువకుడు గురువారం అప్పాపురంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి పది గంటల సమయంలో ప్రమాదవశాత్తు కొమ్మమూరు చానల్‌లో పడి కొట్టుకుపోయాడు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. యువకుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

ముస్లిం శ్మశానవాటికకు స్థలం కేటాయింపు



శలపాడు(చేబ్రోలు): మండలంలోని శలపాడులో ముస్లిం శ్మశానవాటికకు రెవెన్యూ, సర్వే అధికారులు శుక్రవారం సరిహద్దులను కేటాయించారు. గ్రామంలో శ్మశానవాటిక లేకపోవడంతో ముస్లింలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు గ్రామంలోని 15 సెంట్ల ప్రభుత్వ భూమిని కేటాయించారు. తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ, సర్వేయర్ వీరాంజనేయులు పర్యవేక్షణలో సర్వే, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం సరిహద్దులు కేటాయించారు. సుదీర్ఘ కాలంగా ఉన్న శ్మశానవాటిక సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యేకు ముస్లిం అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ మన్నెం వేణుగోపాలరావు, పార్టీ నేత ఉయ్యూరు బాల చంద్రయ్య, స్థానిక ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

అనాథ, వృద్ధుల ఆశ్రమంలో పండ్ల పంపిణీ



గుంటూరు రూరల్: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా జన్మదిన వేడుకల్లో భాగంగా శుక్రవారం నగర మున్సిపల్ కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యుడు, రాష్ట్ర నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు కె. పీర్ మహమ్మద్ ఆధ్వర్యంలో అనాథ, వృద్ధాశ్రమాలు, మదర్‌సాలలో పండ్లు, ఫలహారాలు పంపిణీ చేశారు. గోరంట్లలోని గోతాలస్వామి ఆశ్రమంలో 120 మందికి, మారుతీనగర్‌లోని మదర్‌సాలో 100 మంది చిన్నారులకు పండ్లు, ఫలహారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీర్ మహ్మద్ మాట్లాడుతూ పేదవారికి సాయం చేయడంలో ఎంతో ఆనందం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ముత్యాల నాగరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్ని త్వరితగతిన పూర్తి చేయండి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రోశయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య

పొన్నూరు: మండలంలోని గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం, మండల పరిషత్ సాధారణ నిధుల నుంచి చేపట్టిన పనుల్ని డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య చెప్పారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి. పద్మలీల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులకు తెలిపారు. మునిపల్లె నుంచి బ్రిడ్జి వరకు రోడ్డు వెంబడి పెరిగిన పిచ్చి చెట్లను తొలగించాలని సూచించారు. గొల్లముడిపాడులో నాలుగు సంవత్సరాల కిందట పూర్తయిన మంచి నీటి ట్యాంకును వెంటనే వినియోగంలోకి వచ్చే విధంగా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ. శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నడింపాలెంలో కేంద్ర బృందం పర్యటన



నడింపాలెం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బృందం

నడింపాలెం (ప్రత్తిపాడు): మండల పరిధిలోని నడింపాలెంలో శుక్రవారం కేంద్ర బృందం పర్యటించింది. సెంట్రల్ సెక్రటేరియెట్‌లోని వివిధ శాఖల్లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లుగా చేస్తున్న ఆదిత్యశర్మ, నరేష్ రావని, రిశ్వా గుప్తా, మనోజ్‌నాయక్, కృష్ణకాంత్ చక్రవర్తి, అంకిత్‌రాజ్‌లు గ్రామంలోని సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ)తో పాటు గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల్ని పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డులో జరుగుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్తను సేకరించే విధానం, ప్రత్యేక వాహనాల ద్వారా సెంటరుకు తరలించడం, తడి, పొడి చెత్తలను వేరు చేయడం, వాటి ద్వారా సంపద సృష్టిస్తున్న విధానాలతో పాటు వర్మీకంపోస్టు తయారీ, తద్వారా పంచాయతీకి సమకూరుతున్న ఆదాయం వివరాలను పంచాయతీ కార్యదర్శి ఖాజా బృందానికి వివరించారు. అనంతరం గ్రామ సచివాలయం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న పథకాలు, వాటి అమలు విధానం, డిజిటల్ చెల్లింపులు, ప్రజలకు అందుతున్న డిజిటల్ సేవల్ని నిశితంగా పరిశీలించారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పోషక పదార్థాలు, కల్పిస్తున్న సౌకర్యాలను అంగన్‌వాడీ సిబ్బంది బృందానికి తెలియజేశారు. వెంట నోడల్ అధికారి నాగానంద్, అసిస్టెంట్ నోడల్ అధికారి జి.వి.ఆర్.కె. గుప్తా, ఈవోపీఆర్డీ మావులూరి మోషే, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, సర్పంచ్ లాం రత్నకుమార్, స్వచ్ఛభారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు, ఐటీసీ ఫినిష్ సొసైటీ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం అవసరం



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్

తుమ్మలపాలెం (ప్రత్తిపాడు): ఆరోగ్యవంతమైన సమాజ ఆవశ్యకత ఎంతో ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్ అన్నారు. ఈ నెల 19న ప్రపంచ మరుగు దొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి మండలంలోని తుమ్మలపాలెంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈ మాట్లాడుతూ మరుగుదొడ్లు నిర్మించుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని, ప్రతి ఒక్కరూ నిర్మించుకోవాలని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మన ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యుల్ని కూడా ఆరోగ్యవంతంగా చూసుకోవచ్చని చెప్పారు. ఏఈ వినీల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రెండు గుంతలతో మరుగుదొడ్డిని నిర్మించుకోవడం వల్ల ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. జిల్లా కో-ఆర్డినేటర్ షఫీ, స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కో- ఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శివాజీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాగరాజు, ఐటీసీ కో-ఆర్డినేటర్ ఉమామహేశ్వరి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం



ఉప్పలపాడులో కిట్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ కమ్మ సాంబశివరావు

పెదనందిపాడు: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి పని చేస్తున్నారని వైస్ ఎంపీపీ కమ్మ సాంబశివరావు తెలిపారు. మండలంలోని ఉప్పలపాడులో శుక్రవారం రాత్రి పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమ పాలనలో రాష్ట్రం ముందున్నదని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆయన ప్రజలకు వివరించారు. వలంటీర్లు, గృహ సారథులకు అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రజలకు సంక్షేమ పథకాల గురించి ఎలా వివరించాలో వారికి శిక్షణ ఇచ్చారు. అనంతరం వలంటీర్లకు సంక్షేమ పథకాల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ షేక్ ఖాశింపీరా, ఏబీపాలెం, పెదనందిపాడు సొసైటీ అధ్యక్షులు కె.భూషయ్య, డి. నాగేశ్వరావు, జేసీఎస్ కన్వీనర్ మేడిద రవి, కొరివి సుబ్బారావు, షేక్ రాజు, కొత్త శ్రీను, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెదకాకాని ఏఎస్ఐ శివశంకర్ సింగ్ మృతి



శివశంకర్‌సింగ్ (ఫైల్)

పెదకాకాని: స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న శివశంకర్ సింగ్ (61) శుక్రవారం మృతి చెందారు. 1989లో పోలీసు శాఖలో చేరిన ఆయన గత రెండేళ్లుగా పెదకాకాని పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్నారు. తోటి సిబ్బందితో కలసి గురువారం రాత్రి 10 గంటల సమయంలో కూడా పెదకాకాని ఎస్. కన్వెన్షన్ వద్ద విధుల్లో పాల్గొన్నారు. అనంతరం గుంటూరు తారకరామనగర్‌లోని చిన్న కుమార్తె ఇంటికి చేరిన ఆయన భోజనం అనంతరం నిద్రించారు. అర్ధరాత్రి విపరీతమైన దగ్గు రావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వైద్యపరీక్షలు చేసిన డాక్టర్లు శివశంకర్ సింగ్ అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. ఆయన భార్య రెండేళ్ల కిందట మృతి చెందగా, ఇద్దరు కుమార్తెల వద్దనే ఉంటున్నారు. శివశంకర్ సింగ్ భౌతికకాయాన్ని శుక్రవారం పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు, ఎస్ఐ వినోద్‌బాబు, సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

హర్ ఘర్ జల్ గ్రామంగా కుర్నూతల



సర్పంచి గోపాలకృష్ణకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న క్రిరణ్‌కుమార్

కుర్నూతల (ప్రత్తిపాడు): వట్టిచెరుకూరు మండలంలోని కుర్నూతలను హర్ ఘర్ జల్ గ్రామంగా ప్రకటించినట్లు జలజీవన్ మిషన్ ప్రాజెక్టు మేనేజర్ పి. కిరణ్‌కుమార్ తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం జలజీవన్ మిషన్ గ్రామసభను నిర్వహించారు. ఇటీవల జేజేఎం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించేందుకు పైపులైన్లతో పాటు కుళాయిలు ఏర్పాటు చేశారు. దీంతో కుర్నూతల గ్రామాన్ని హర్ ఘర్ జల్ గ్రామంగా అధికారులు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని ప్రాజెక్టు మేనేజర్ పి. కిరణ్‌కుమార్ గ్రామ సర్పంచి యర్రాకుల గోపాలకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్ లక్ష్యాల్ని ప్రాజెక్టు మేనేజర్ పి. కిరణ్‌కుమార్ ప్రజలకు వివరించారు. ప్రాజెక్టులో భాగంగా ప్రతి ఇంటికీ శుద్ధ జలాల్ని అందించడమే పథక ఉద్దేశమని తెలిపారు. సర్పంచి గోపాలకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయిలను ఉచితంగా వేసిన యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులంతా నీటిని వృథా చేయకుండా, జాగ్రత్తగా వాడుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి రవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య



పెదకాకాని శివాలయంలో నాగేంద్రస్వామికి పాలు పోస్తున్న భక్తులు



గొడపాలెం నాగేంద్రస్వామి పుట్ట వద్ద పాలు పోస్తున్న భక్తులు

పొన్నూరు: మండలంలోని కట్టెంపూడిలో ఉన్న శ్రీ నాగేంద్రస్వామి దేవస్థానం (పుట్ట)లో నాగుల చవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తుల విశేష సంఖ్యలో పాల్గొని, ఆలయ ఆవరణలోని నాగపుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే రోశయ్య పుట్టలో పాలు పోసి, ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే భక్తులకు అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమాల్ని ట్రస్ట్ చైర్మన్ వరాలశెట్టి శివ నాగేంద్రమ్మ, సభ్యులు, ఆలయ మేనేజర్ మామిడాల శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

భక్తులతో కళకళలాడిన శివాలయం

పెదకాకాని: స్థానిక శివాలయం, గొడపాలెం నాగేంద్రస్వామి పుట్ట ప్రాంగణం శుక్రవారం భక్తులతో కళకళలాడాయి. నాగేంద్రస్వామి పుట్ట వద్ద అర్చకుడు ప్రభాకరశాస్త్రి భక్తులకు గోత్రనామ పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పుట్టలో పాలు పోసి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఆలయంలో నాగేంద్రస్వామిని, సువర్చలాదేవిని దర్శించుకున్నారు. ప్రాంగణంలో ఉన్న సుబ్రమణ్యేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

■ పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానములో నాగ ప్రతిమలకు పాలు పోసేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాకార మండపంలో ఏర్పాటు చేసిన టేబుల్స్‌పై కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

నల్లపాడు అగస్త్యేశ్వరాలయంలో నాగులచవితి పూజలు

గుంటూరు రూరల్: నల్లపాడులోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహాన్యాస పూర్వక సర్పసూక్త సహిత రుద్రాభిషేకాలను నిర్వహించారు. భక్తులు స్వామికి క్షీరాభిషేకాలు చేశారు. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు స్వామిని దర్శించుకున్నారు.

వ్యాస రచన పోటీలకు స్పందన



ప్రత్తిపాడు గ్రంథాలయంలో జరిగిన వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రత్తిపాడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రత్తిపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు లైబ్రేరియన్ అరుణ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో 'గ్రంథాలయాలు వాటి ప్రాముఖ్యత'పై ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు, సీనియర్ విభాగంలో 'సమాజ అభివృద్ధిలో స్త్రీ పాత్ర'పై ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు పోటీలు జరిగాయి. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన ఎనభై మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను ఉపాధ్యాయులు మణిరత్నం, రాజులు పర్యవేక్షించారు.

చిత్రలేఖన పోటీల్లో విజేతలు వీరే...

గ్రంథాలయంలో ఈ నెల16న జరిగిన చిత్రలేఖన పోటీల్లో విజేతల వివరాల్ని లైబ్రేరియన్ అరుణ వెల్లడించారు. జూనియర్ విభాగంలో ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు పి. తాన్యాజోయల్ (ఆరో తరగతి)ప్రథమ స్థానం, కె. శృతి (ఆరో తరగతి) ద్వితీయ స్థానం, అక్షయ విద్యాలయం ఏడో తరగతి విద్యార్థిని ఎస్. నర్మద తృతీయ స్థానాన్ని సాధించారు. సీనియర్ విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆర్. హారిక (ప్రత్తిపాడు హైస్కూలు) ప్రథమ స్థానాన్ని, ఎనిమిదో తరగతి విద్యార్థిని వి. వైష్ణవిరాణి (అక్షయ విద్యాలయం) ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు ప్రదానం చేస్తామని అరుణ తెలిపారు.

పెదకాకానిలో...

పెదకాకాని గ్రంథాలయం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, చిత్రలేఖనం పోటీలతో పాటు కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమాల్ని కొప్పురావూరు జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ప్రభాకరరావు, ఉపాధ్యాయులు రాజేశ్వరి, భవాని, శ్రీనివాసరావు నిర్వహించారు. మధ్యాహ్నం పెదకాకాని జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం కొప్పూరి భాస్కరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు సేవ్ వాటర్, స్టాప్ పొల్యూషన్, సీనియర్‌లకు స్వాతంత్ర సమరయోధుల ముఖచిత్రాలు అనే అంశంపై చిత్రలేఖనం పోటీల్ని నిర్వహించారు. గ్రంథాలయాల ఆవశ్యకత గురించి హెచ్‌ఎం భాస్కరరావు విద్యార్థులుకు వివరించారు. తెలుగు ఉపాధ్యాయుడు గురవయ్య ఆధునిక, ప్రాచీన కవులు, వారి రచనల్ని వివరించారు.

సందడిగా బాలల దినోత్సవం

పెదకాకాని: మండలంలోని నంబూరు అలీరఫత్‌నగర్‌లో శుక్రవారం స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ దేవరపల్లి కొండలరావు ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ వినయ్ డానియెల్, డాక్టర్ తాజ్‌మల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు బాలలే మార్గదర్శకులని పేర్కొన్నారు. అనంతరం 100మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, విద్యా సామగ్రితో పాటు కేకులు పంచిపెట్టారు. కార్యక్రమంలో మదిర శేషయ్య, పాస్టర్ అబ్రహం, రాజ్‌కుమార్, షబానా, చైతన్య, నేపాల్ పాల్గొన్నారు.

నాణ్యమైన పరిశోధనల దిశగా విద్యార్థులు సాగాలి



సదస్సులో బ్రోచర్స్ ఆవిష్కరిస్తున్న వెంకటరమణ తదితరులు

గుంటూరు రూరల్: నాణ్యమైన పరిశోధనల దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యనిర్వాహక సభ్యుడు డాక్టర్ ఎం. వెంకటరమణ తెలిపారు. చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం రెండు రోజుల పాటు నిర్వహించనున్న క్వాలిటీ బై డిజైన్ ఏ రోడ్ మ్యాప్ ఫర్ క్వాలిటీ ఫార్మాస్యూటికల్స్ ప్రొడక్ట్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఫార్మా రంగంలో ఔషధ అభివృద్ధి, ఉత్పత్తి, సమర్థత ఆవిష్కరణల్ని నిర్ధారించడానికి డిజైన్ ద్వారా నాణ్యత అనేది ముఖ్యమైన ప్రక్రియగా మారిందని తెలిపారు. దీన్నే ఆంగ్ల భాషలో క్యూబీడీగా వ్యవహరిస్తారన్నారు. సాంకేతిక విశ్లేషణాత్మక పద్ధతి, అభివృద్ధి, ఔషధ తయారీ రంగంలో నానో టెక్నాలజీ రంగాలలో వినియోగించే వీలుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫార్మా కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. విలియం క్యారీ మాట్లాడుతూ విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు, ఫార్మా రంగంలో తాజా పోకడలపై జ్ఞానం, అందులో ఎదురయ్యే సవాళ్లను తెలుసుకునే అవకాశం, ఔషధ తయారీ ప్రక్రియలో రూపకల్పన ద్వారా నాణ్యత అనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సదస్సులో ఇండోనేషియా, మలేషియా, మాల్దీవ్స్, కొరియా తదితర దేశాలనుంచి 620 మంది హాజరై, 250 మంది పరిశోధన పత్రాల్ని సమర్పించారని తెలిపారు. అనంతరం సదస్సులో పరిశోధన పత్రాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సి.ఎస్. శ్రీనివాస్, కోశాధికారి ఆర్. గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అధిక ఉత్పత్తి పంట రకాలను అందించడానికి కృషి



రైతులకు సంచులను అందజేస్తున్న కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ డైరెక్టర్ వై.జి. ప్రసాద్

గుంటూరు రూరల్: తక్కువ కాలంలో అధిక ఉత్పత్తిని అందించే పంట రకాలను రైతులకు అందించేందుకు కృషి చేస్తున్నామని కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ డైరెక్టర్ వై.జి. ప్రసాద్ తెలిపారు. బోయపాలెంలో కృషి విజ్ఞాన కేంద్రం, సీఐసీఆర్, నూజివీడు సీడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో సిరి, ఆర్మిక రకాల పంటల క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ సిరి, ఆర్మిక రకాలతో అధిక సాంద్రత పత్తిని సాగు చేసినట్లు తెలిపారు. వాతావరణం, నేల స్థితిగతుల్ని బట్టి మొక్కల సాంద్రత పెంచి, తక్కువ కాలపరిమితిలో ఎక్కువ దిగుబడుల్ని సాధించడం ఈ ప్రాజెక్ట్ ముఖ్య లక్ష్యమని ఆయన వివరించారు. పత్తిలో గులాబీ రంగు పురుగుల ఉధృతిని గమనించి, సరైన యాజమాన్య పద్ధతుల ద్వారా నివారించాలని ఆయన సూచించారు. పంట కోత అనంతరం పత్తి కట్టెను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నుకోవాలని తెలిపారు. అనంతరం రైతులకు నేత పత్తి సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త కె.వి. సుబ్రహ్మణ్యం, అగ్రానమీ శాస్త్రవేత్త ఎం. గంగాదేవి పాల్గొన్నారు.

ఒత్తిడితో మహిళల్లో పీసీఓడీ సమస్యలు



మాట్లాడుతున్న గైనకాలజిస్ట్ అనిత

ప్రత్తిపాడు: ఒత్తిడి వల్ల మహిళల్లో పీసీఓడీ సమస్యలు ఉత్పన్నమవుతాయని గైనకాలజిస్ట్ డాక్టర్ ఎన్. అనిత తెలిపారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్, రమేష్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గైనకాలజిస్ట్ అనిత మాట్లాడుతూ జీవన విధానంలో వస్తున్న మార్పులు, తీవ్రమైన ఒత్తిడి, హార్మోనల్ ఇన్ బ్యాలెన్స్ వల్ల మహిళలు, విద్యార్థినుల్లో పీసీఓడీ సమస్యలు వస్తున్నాయన్నారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ కె. హరిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె. చంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com